# సులోబు కథ

దాన్ని మేము సులోబు అనేవాళ్లం. అసలా పేరు ఎలా వచ్చిందో 'ఇంగ్లీషు స్లోప్' కాబోలు! వంకర టింకరై సులోబుగా రూపుదిద్దుకుంది. అదే-లెవెల్ క్రాసింగ్!

దానికి ఆ వైపు-గూడెం వెళ్లే దొంకదారి, ఈ వైపు పాలెం కంకర్రోడ్డు.

పాలెం రోడ్డు పనస చెక్కలా ఉండేది. గూడెం దారి తాటి మట్టలా సాగేది.

సులోబు పక్కన ఒకవైపు కలువ కుంట, రెండోవైపు గుర్రపు డెక్క ఆకుల్తో పాత చెరువు. కలువగుంట ఆడపిల్ల చూపులా అనిపించేది. పాత చెరువు తాగినోడి నోరులా వాసనేస్తూ ఉండేది.

గట్టుమీద వోవైపు తాళ్లు, వోవైపు ఈతలూ, తుమ్మలూ.

'పాలెంకీ, గూడెంకీ మధ్య సమ అంతరాన్ని సూచిస్తూ రైల్వే లైను!

సులోబుకి... తరాలూ, అంతరాలూ, తరాంతరాలూ, అంతరాల తరాలూ....అన్నీ తెలుసు.!

పాలెం పారిజాతం, గూడెం గున్నయ్యా తనకాడే ఊసులాడుకోవడం బాస చేసుకోవడం అన్నీ సులోబుకి తెలుసు!

దోసిట్లో చీకటి పెట్టుకొని పారి పోయిన పంతులమ్మ కథా, కరణం గారి వాముల దొడ్డిలో దెబ్బలు తిన్న మంగి వ్యథా... సులోబు రాయికి ఎరికే!!

పంతులమ్మకి మునుసబు మిగిల్చిన మచ్చకీ, మంగికీ కరణం కొడుకు వేసిన 'దొంగ' ముద్రకీ ఆరాయి చెమర్చింది. అదీ అర్ధరాత్రి రాలుచుక్క సాక్ష్యంగా!

అందుకే, మా పద్మనాభం ఆ రాయిని "ఇది జలగర్భ శిలరా" అనేవాడు. వాడి కథ విని కూడా అది అలాగే చెమ్మగిల్లింది మరి!

పద్మనాభం అడకత్తెరలో పోకచెక్క. ఇటు సవత్తల్లి, అటు సొంత తండ్రీ...

ఎప్పుడూ పిడికిళ్ళు బిగించడం, పళ్ళు కొరకడం, డొక్కచించి డోలు కట్టడం!!

సులోబుకి మా జట్టంటే చాలా ముచ్చట. మేమంతా మరి కిష్కింధ సంతతి వాళ్లం!

తీగె మేకుల్ని రైలు పట్టాల మీద పెట్టి దూరంగా పరు గెత్తుకుపోయి నిలబడటం. రైలు వెళ్లిన తరువాత సాగి, చచ్చుపడి బద్దలా మారిన మేకుల్ని తెచ్చుకోవడం సత్యంకి అదో సరదా. వెర్రి ఆనందం. "పట్టాల్లేని ఇంజన్ తయారు చేస్తానురా... పెద్దయితే" అంటూ ఉండేవాడు. వాడి కళ్లలో కోటి ఇంజన్‌ల హెడ్‌లైట్లు!

వెంకటేశ్వర్లుకి గ్రీజ్ కడ్డీలు కావాలి. ఔటర్ సిగ్నల్ దగ్గర ఏదో రైలు ఆగుతూ ఉండేది. వెంటనే వెంకటేశ్వర్లు అక్కడ ప్రత్యక్షం. డ్రైవర్‌తో 'బట్లర్' ఇంగ్లీష్ మాట్లాడేవాడు. డ్రైవర్ వో నాలుగు గ్రీజ్ ముక్కలు విసిరేవాడు. అవి తీసుకొని ఒకటే సంబరపడే వాడు.

ఆ గ్రీజ్‌తో రకరకాల బొమ్మల్ని చేసి చూపుతూ ఉండేవాడు. తానోపెద్ద శిల్పినన్నట్టు!

పున్నారావ్ మా జట్టులో బండవెధవ!

వాడు తాటి గెలలూ, ఈత గెలలూ దించడంలో అందెవేసిన చెయ్యి!

పందెం కాసి తాటి ముంజలు తినేవాడు. రాత్రికి మా ఇంటికి వచ్చి 'పెద్దమ్మా... ఆవకాయ, అన్నం రానీ' అని కూచునేవాడు. పెరట్లో అరటి ఆకుని కోసుకొచ్చేది నా చెల్లెలు వరాలు!

నిజానికి సులోబు మా అందరి సహోదరి! నిజానికి సులోబు మా అందరి గుండెల దరి!

ఓపికలేక వదిలేసిన హోమ్ వర్క్ సాక్ష్యమూ, వర్షంలో తడిసి, నీరు పిండుతున్న చొక్కాల ఎక్కాల భాష్యమూ, సులోబే!

అదిగో...

సులోబుకి దగ్గరగా....

నిమ్మళంగా సాగుతోంది దున్నపోతులబండి. దానిమీద వడ్ల గింజల బస్తాలు.

వెనగ్గా... జేబుల్లో గోళీలతో, చేతుల్లో ఈతకాయల్తో మా జట్టు- నేను, వెంకటేశ్వర్లు, పున్నారావు, సత్యం, పద్మనాభం. నెమ్మదిగా వస్తున్నాం.

సులోబుమీద ఆగిపోయింది బండి.

బసవయ్య బాబాయి దున్నపోతుల్ని చెర్నాకోలతో అదిలిస్తున్నాడు; కొడుతున్నాడు; మధ్య మధ్య తిడుతున్నాడు. దాపటెనుపోతు మొండికేసింది.

దూరంగా రైలు కూత!

బసవయ్య గుండెల్లో గుబులు. పట్టాల మధ్యలో వుంది బండి! మా అందరికీ వినోదం, సంబరం!

'అరేయ్... వో చెయ్యేయ్యండర్రా' పిలిచేడు. కాదు అరచాడు! మాకు వొకటే నవ్వు!

పట్టాలు అదురుతున్నై.

కోపంగా చూస్తూ మళ్లీ గట్టిగా అరచాడు. 'ఒరేయ్ ప్రకాశం చూస్తారేరా... రండిరా'

నేను మా వాళ్లకి సైగ చేశాను.

విద్యుద్దీతలా కదలిక!

ఒక్క తోపుతో కదిలింది బండి!

క్షణంలో పల్లంలోకి పరుగో పరుగు!

రైలు వెళ్లిపోయింది. పెట్టెల్లో నిలబడిన ప్రయాణికులకీ... మా నుంచి చిత్ర విచిత్ర భంగిమల్లో ప్రశ్నలూ, పొలికేకలూ, వెక్కిరింతలూ, వ్యాఖ్యలూ!!

మేమంతా ఒక్కొక్కరాయిమీద ఒక్కొక్కళ్లం కూర్చున్నాం. ఈత పళ్లు నములుతున్నాం.

ఎక్కణ్ణుంచో...

గాలి మోసుకొస్తున్న పుష్ప విలాపం!

దూరంగా దొంకపక్క తురాయి చెట్టు కొమ్మల్లో... గొడ్లకాపరి. వెదురు గొట్టంనుంచి..

ప్రాణ స్వరాల్ని వొలికిస్తున్నాడు.

'బుద్దదేవుని భూమిలో పుట్టినావు'!

ఏదో ధరణీ రహస్యాలు చెప్తున్నాడు!

దాని ముందు పద్యాలూ, దాని తరువాత సద్యాలూ చదువుకుంటూ ఇళ్లకేసి సాగేము.

అన్నం పెడుతూ చెప్పింది అమ్మ, 'బసవయ్య బాబాయి పంపించాడురా... గడ్డ పెరుగు వేసుకో. బుట్టెడు మొక్కజొన్న పొత్తులూ పంపాడు. సులోబుకాడ పెద్ద సాయం చేశారంటగా ... మీరంతా?

మనసంతా... రేగడి పెరుగే అయింది నాకు! మా జట్టులో అందరికి బాబాయి చల్లదనమే ఆరాత్రి! సులోబూ, రైలు పట్టాలూ...రెక్కలు ఊపుకుంటూ నా మేధస్సులో గిరికీలు కొట్టసాగినై.

బసవయ్య బాబాయి నాచుట్టూ ఒక అభిమాన ప్రాంగణం రచించి ఇచ్చాడు.

... ముప్పై ఏళ్ల తరువాత....

ఇవాళ

మా సత్యం.... సెక్రటేరియట్‌లో గుమాస్తా. వెంకటేశ్వర్లు తెనాలిలో క్లాత్ మర్చెంట్‌ట. పున్నారావు ఎక్కడున్నాడో తెలియదు. పద్మనాభం టీచర్. నేను సరే...

చిత్రకారుడిగా స్థిరపడ్డాను.

బసవయ్య బాబాయి కీర్తిశేషుడై నా స్మృతి ధారలో కదుల్తూ నిలిచాడు. అవును, మనిషి శాశ్వతం కాకపోవచ్చు కానీ, అతను పంచిన మనసు చిరంజీవి!

అన్నట్టు... మా సులోచుకీ కరెంటు వచ్చిందట. ఇప్పుడు దాని 'కతే' వేరు!

* * *

(పల్లకి విన్నూత్న వారపత్రిక 24 ఫిబ్రవరి 1993.)

